ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 19 మార్చి 2024



జగిత్యాలలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



జగిత్యాల కాషాయమయం

- ప్రధాని మోదీ పర్యటన సక్సెస్
- విజయ సంకల్ప సభతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం

జగిత్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ విజయ సంకల్ప సభతో జగిత్యాల జిల్లా కేంద్రం కషాయమయం అయ్యింది. ప్రధాని మోదీ తొలిసారి జగిత్యాలకు రావడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు సభకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభస్థా నాలకు చెందిన ముఖ్యనేతలందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి జన సమీకరణ భారీగా చేపడంతో సభా ప్రాంగణం నిండిపోయింది. షెడ్యూల్ ప్రకారమే మోదీ పర్యటన సాగింది. ప్రధాని వేదిక పైకి రాగానే మోదీ...మోదీ అంటూ ప్రజలు, పార్టీ కార్యకర్తలు లేచి చప్పట్లు కొట్టారు. అనం తరం సభకు వచ్చిన వారికి ఆయన వేదిక పై నుంచి అభివాదం చేశారు. మోదీ తన ప్రసంగంలో నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులు ధర్మపురి అర వింద్, బండి సంజయ్, గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. వీరి గ్యారంటీకి మోదీ అండగా ఉంటా రని ప్రధాని చెప్పడంతో ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.





భరతమాత వేషధారణలో చిన్నారి, నినాదాలు చేస్తున్న మహిళలు

● తెలుగులో ప్రసంగం ప్రారంభం

సభలో మోదీ ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంతో సభికులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. ప్రసంగంలో ఆద్యంతం ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం మోదీ చేశారు. ఈ సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ప్రజలు బీజేపీ పట్టం కట్టనున్నారని అర్థమవుతోందని ప్రధాని చెప్పడంతో స్థానికుల నుంచి మంచి స్పందన వచ్చింది. మోదీ తన ప్రసంగంలో ఎక్కువగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. విజయ సంకల్ప సభ విజయవంతం కావడం బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది. మోదీ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. కేంద్రంలో బీజేపీ సర్కారు హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ పీఎం మోదీ ప్రజలను ఆకర్శించే విధంగా ప్రసంగించారు. మోదీ సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.



మోదీని సన్మానిస్తున్న ఎంపీ బండి సంజయ్



పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మోదీ



ప్రధాని మోదీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



హాజరైన కార్యకర్తలు, జనం

కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంది

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



జగిత్యాల టౌన్: కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. జగిత్యాలలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో కాళేశ్వరం కుంభకోణంలో వేల కోట్లు రూపాయలు కేసీఆర్ కుటుంబ సభ్యులు దోచుకుందన్నారు. లిక్కర్ స్కాం, గొర్రెల స్కాం, దళితబంధు స్కాం ఇలా బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనం దోపిడికి గురయిందని విమర్శించారు. దేశంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. మెజార్టీ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్నారు. ప్రధానంగా మహిళలు, యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. దక్షిణ భారత దేశంలో రోజురోజుకు బీజేపీ బలపడుతుందన్నారు. ఇటీవల ప్రధానీ మోదీ దక్షిణ భారత దేశంలో జరుపుతున్న పర్యటనల్లో బీజేపీ బలోపేతం తేటతెల్లం అవుతుందన్నారు. ప్రధాని మోదీ నిర్వహించిన ప్రతీ బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లబిస్తుందన్నారు.

జగిత్యాల ఉద్యమాల గడ్డ

- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



జగిత్యాల ఉద్యమాల గడ్డ అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. జగిత్యాలలో రామన్న, గోపన్న తీవ్రవాదుల చేతిలో అమరులయ్యారని గుర్తు చేశారు. వీరులనుగన్న జగిత్యాల గడ్డలో పీఎఫ్ఐ అనే దేశద్రోహులు అడుగుపెట్టడం ఆందోళనకరంగా ఉందన్నారు. రాముడి పేరు చెబితే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గజగజ వణుకుతున్నారన్నారు. దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముడి గుడి కట్టింది బీజేపీయేనని స్పష్టంచేశారు. బీజేపీ బరాబర్ రాముడి పేరుతోనే ఎన్నికలకు వెళ్తుందని, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. నిజాం సమాధి వద్ద మొకరిల్లిన కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టివేసి రజాకార్ల సినిమా చూపించాలన్నారు.

పర్యటన జరిగిందిలా...

- ఉదయం 10.45 గంటలకు పీఎం మోదీ హెలి క్యాప్టర్ ద్వారా హైద్రాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్నారు.
- ఉదయం 10.55 నిమిషాలకు పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయ మైదానంలో ఏర్పా టు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగారు.
- 11.15 నిమిషాలకు కాన్వయ్ ద్వారా రోడ్డు మార్గంలో హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 11.32 నిమిషాలకు పీఎం మోదీ ప్రసంగం ప్రారంభించారు.
- 12.20 గంటలకు ప్రజలకు వీడ్కోలు చెబుతూ పీఎం మోదీ సభా వేదిక వద్ద నుంచి హెలి ప్యాడ్ వద్దకు వెనుదిరిగారు.
- 12.35 నిమిషాలకు హెలిక్యాప్టర్ ద్వారా పీఎం మోదీ హైద్రాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

మోదీ సభ సైడ్ లైట్స్

- ప్రధాని మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించడంతో సభికులు చప్పట్లు, ఈలలు వేశారు.
- సుమారు గంట పాటు పీఎం మోదీ జగిత్యాల సభ వేదిక వద్ద గడిపారు.
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలుకుతూ ప్రధానీ మోదీ పిలుపు మేరకు సభికులు తమ మొబైల్స్‌లోని టార్చ్‌లైట్ ఆన్ చేసి కేరిం తలు కొట్టారు.
- విజయ సంకల్ప సభలో పీఎం మోదీ వచ్చిన తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కిషన్ రెడ్డికి మినహా ఇతరులెవరికి ప్రసగించే అవ కాశం దక్కలేదు.
- ఎంపీ బండి సంజయ్ ప్రసంగిస్తున్న సమ యంలో యువకులు కేరింతలు కొట్టారు
- ప్రధాని మోదీ కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థులను నా సోద రులు అని సంబోదించారు.



నేడు రైతు నేస్తం

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 18 : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడుతారని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ తెలిపారు. జిల్లాలోని చంద్రంపేట జిల్లా రైతు వేదికతోపాటు వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట రైతు వేదికల్లో ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ వివరిస్తారని తెలిపారు. ఆయిల్‌పాం సాగులో తీసుకోవాల్సిన మెలకవలు గురించి శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, వివిధ రకాల కూరగాయ పంటల్లో వాడదగు పురుగు మందుల వివరాలను డాక్టర్ కవిత వివరిస్తారిని పేర్కొన్నారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంబీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలకు చెందిన రైతులు చంద్రంపేట జిల్లా రైతువేదికలో జరిగే వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని, వేములవాడ నియోజకవర్గంలోని వేములవాడ, వేములవాడ రూరల్ బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాలకు చెందిన రైతులు హన్మాజీపేట రైతువేదికలో పాల్గొనాలని సూచించారు.

బీఆర్ఎస్‌కు మరో ఎదురు దెబ్బ

- కాంగ్రెస్ గూటికి పట్టణ సెస్ డైరెక్టర్



ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 18 : వేములవాడలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. శాసనసభ ఎన్నికల నుంచి పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు వరుసగా ఆ పార్టీని వీడుతుండగా, తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన వేములవాడ పట్టణ సెస్ డైరెక్టర్, పురపాలక సంఘం మాజీ అధ్యక్షురాలు నామాల ఉమ లక్ష్మీరాజం సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, తూం మధు, పుల్కం రాజు, కనికరపు రాకేశ్, రైకనపేట క్రాంతి కుమార్, నామాల పోశెట్టి, పాత సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం పల్లిమక్త మాజీ సర్పంచ్ నందగిరి అంజయ్య సోమవారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అయనతో పాటు మరి కొంతమంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

పదోతరగతి పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేములవాడ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తనిఖీ చేశారు. పది పరీక్షలను డీఈవో రమేష్‌కుమార్ పర్యవేక్షించారు. మొదటి రోజు 6472 మంది రెగ్యులర్ విద్యార్థులకు 6467 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముగ్గురు ప్రైవేటు విద్యార్థులకు ఒక విద్యార్థి మాత్రం పరీక్ష రాయలేదు.

నీటి సరఫరాపై పక్కా ప్రణాళిక ఉండాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 18: ఈ వేసవిలో తాగునీటి సరఫరాపై పక్కా ప్రణాళిక ఉండాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్ ఆదేశించారు. తాగునీటి సమస్య, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీడీఎంఏ డైరెక్టర్ దివ్య దేవరాజన్ హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్) ఉమ్మడి జిల్లాల ఈఈలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని రాజకీయ పార్టీల బ్యానర్లు, క్యాలెండర్లు, ఫొటోలు, పోస్టర్లు తొలగించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. నీటి వనరులు ఎక్కడా ఉన్నాయి? వాటిలో నిల్వ ఎంత? ప్రత్యామ్నాయం (పవర్ బోర్లు, బావులు) ఏం ఉన్నాయో చూసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో పర్యటించాలని ఆదేశించారు. బల్దియాల పరిధిలో ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటికి సంబంధించి చేపట్టే పనులకు ఎస్డీఎఫ్, బల్దియాల్లో జనరల్ ఫండ్ వాడుకోవాలని వెల్లడించారు. వాన నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించాలనే విషయంపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్

విద్యుత్ స్తంభాలకు మరమ్మతు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మరమ్మతు చేస్తున్న సెస్ సిబ్బంది

రుద్రంగి, మార్చి 18: రుద్రంగి మండల కేంద్రంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి ప్రధాన రహదారి పక్కన ఉన్న మట్టి కోతకు గురైంది. దీంతో విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. ఈ విషయమై 'వానొచ్చే..వరదొచ్చే' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, పోలీస్ స్టేషన్‌ల ఎదుట విద్యుత్ స్తంభాలను సరి చేశారు.

నగదు పట్టివేత


తంగళ్లపల్లి, మార్చి 18 : తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో అధికారులు తనిఖీలు చేపట్టారు. సోమవారం హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వస్తున్న కారును తనిఖీ చేయగా ఆరుముల్ల స్వామి వద్ద రూ.లక్ష బయటబడ్డాయి. స్వాధీనం చేసుకొని రసీదు ఇచ్చినట్లు చెక్ పోస్ట్ అధికారి ఏఈ సుమన్ తెలిపారు.

రాజకీయ పార్టీల పోస్టర్ల తొలగింపు

గంబీరావుపేట, మార్చి 18 : గంబీరావుపేట మండల కేంద్రంలో పలు రాజకీయాల పార్టీల పోస్టర్ల తొలగింపు మొదలైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన క్రమంలో మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట ఉన్న పలు రాజకీయ పార్టీల పోస్టర్లను గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

కోనరావుపేట, మార్చి 18: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి సీఐగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్ట మొదటిసారిగా కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించవద్దన్నారు. మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని అన్నారు. సోషల్ మీడియా పోస్టుల్లో జాగ్రత్తగా ఉండాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుం టామని అన్నారు. కోనరావుపేట ఎస్సై అంజనేయులు ఉన్నారు.



జిల్లాలో వడగళ్ల బీభత్సం

సిరిసిల్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. సోమవారం రాత్రి రాళ్ల వర్షం పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంబీరావుపేట, ఇల్లంతకుంట మండలాల్లోని పలు గ్రామాల్లో వడళ్ల వర్షానికి కరెంట్ స్తంభాలు పడిపోయాయి. చెట్లు విరిగిపడ్డాయి. ముస్తాబాద్ మండల కేంద్రంలో రైతు ఎలుసాని ఎల్లయ్య (55) హోటల్ ముందు నిలబడి ఉండగా చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడడంతో స్తంభం విరిగి ఎల్లయ్య మీద పడింది. దీంతో ఎల్లయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. మీస బాబు అనే మరొకరికి గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వడగళ్ల వర్షానికి వందల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. గాలి దుమారానికి విద్యుత్‌వైర్లు తెగిపడడం, స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.



ముస్తాబాద్ మండల కేంద్రంలో తెగిపడిన విద్యుత్ తీగలు



చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 18: సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లోని ఓ మెడికల్ షాప్ వద్ద 48ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పడిపోవడంతో స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందినట్లు టౌన్ సీఐ రఘుపతి సోమవారం తెలిపారు. ఇతని వివరాలు ఎవరైనా తెలిసినచో సమాచారం అందివ్వాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆ వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచామని పేర్కొన్నారు. గతంలోనూ రెండు సార్లు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందాడని, ఇతని వివరాలు తెలిస్తే ఫోన్ నెం. 8712656366కు సమాచారం అందివ్వాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి


● ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి 18: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెవెన్ డే రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ అండ్ యంగ్ ఫాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ ఇన్ తెలంగాణ రీజియన్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ పరిశోధక విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పరిశోధనలో అవలంభించే స్టాటిస్టికల్ మెళకువలు, పరిశోధన ఆవశ్యకత తదితర అంశాలు ఈ కోర్సు ద్వారా నేర్చుకోవచ్చన్నారు. ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి హానరరీ డైరెక్టర్ ఐసిఎస్ఎస్ఆర్, సదరన్ రీజియన్ మాట్లాడుతూ పరిశోధన అంశాల పట్ల నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలకు ఐసిఎస్ఎస్ఆర్, ఆర్థికపరమైన సహాయం చేయటానికి ముందుకు వస్తుందన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీపైన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పీహెచ్‌డీ విద్యార్థులతో పాటు అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవటంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్ మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు ఎప్పుడు కొత్త అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. శాతవాహన విశ్వావిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ ఈ పరిశోధన కోర్సును విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు ఆచార్య సుధాకర్‌రెడ్డి 'ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఏనాబ్లెడ్ రీసెర్చ్ ఇన్ సోషల్ సైన్సెస్' అనే అంశం పైన తన సెషన్‌ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ ఎం మనోజ్‌కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ తిరుపతి, బి.నరేష్ డాక్టర్ పరశురాములు, పరిశోధక విద్యార్థులు అజీజ్, విజయానంద్, వివిధ విశ్వ విద్యాలయాల నుంచి వచ్చిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌యూ ఉపకులపతి మల్లేష్





హుజూరాబాద్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

● రూ. 8.64లక్షలు దోచుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు




ఏటీఎంను పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

హుజూరాబాద్, మార్చి 18: గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలో చొరబడి భారీ ఎత్తున డబ్బు దోచుకెళ్లిన సంఘటన హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం బ్యాంకు సిబ్బంది సుమారు రూ.25లక్షలు పెట్టి వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలోకి చొరబడి ఏటీఎం మిషన్‌ను కట్టర్‌తో కట్‌చేసి అందులో ఉన్న రూ.8.64లక్షలు దోచుకెళ్లారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఏటీఎం మిషన్‌ను పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి ఏటీఎంను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు టౌన్ సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.









వివాహ ఊరేగింపులో విషాదం

● డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

ఓదెల, మార్చి 18: మండలంలోని కొలనూర్‌లో ఆదివారం రాత్రి ఒక వివాహ ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ కరీంనగర్‌కు చెందిన రావుల విజయ కుమార్(30) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. అతని మిత్రులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. విజయకుమార్ మిత్ర బృందం కొలనూర్‌కు చెందిన ఓ వ్యక్తి వివాహానికి వెళ్లారు. అనంతరం ఊరేగింపు నిర్వహిస్తున్న క్రమంలో విజయ్‌కుమార్ డ్యాన్స్ చేస్తూ, అకస్మాత్తుగా అక్కడే కుప్పకూలాడు. దీంతో స్థానికులు, మిత్రులు ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్ష అనంతరం అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రావుల పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

ధర్మారం, మార్చి 18: మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన భూత గడ్డల నర్సింగం(35) అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో నీట మునిగి మృతి చెందాడు. కొత్తూర్ గ్రామ శివారులో సాగల నారాయణ పొలం వద్ద ఉన్న వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు నర్సింగం దిగాడు. బావిలో తూరు తీగ అతని చేతులకు చుట్టుకుని అదే బావిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ విఫలం

● కాళేశ్వరం అవినీతికి ఆస్కారం ఇచ్చింది మోదీనే ● తెలంగాణ ఫలితాలే దేశంలో పునరావృతం ● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఎంపీ సీట్లు సున్నాకే పరిమితమవుతాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి అమ్మకానికి పెట్టేలా చేసిన వ్యక్తి మోదీ అని అన్నారు. జగిత్యాలలో నిర్వహించిన సభలో మోదీ చేసిన ప్రసంగంలో దేశ భవిష్యత్ ప్రణాళిక వివరించాల్సి ఉండగా నిస్తేజంగా ఉందని, నిర్మాణాత్మకంగా ఉంటుందని భావిస్తే స్పష్టత లోపించిందన్నారు. ప్రధాని హోదాలో ఉన్న మోదీ బాధ్యతారహితంగా మాట్లాడారన్నారు. దశాబ్ద కాలంగా మోదీ దేశాన్ని పరిపాలించినప్పటికీ రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. మూడు నల్ల చట్టాలను ఉపసంహరించాలని రైతులు ఉద్యమిస్తే ప్రధాని వెనుకడుగు వేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పంటలకు గిట్టుబాట ధర కల్పనకు కృషిచేశామని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఎంత వరకు నెరవేర్చారో కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాలన్నారు. నిజామాబాద్‌లో గతంలో కంటే ఇప్పుడు పసుపు పంట సాగు 30 వేల ఎకరాలకు తగ్గిందని ఆరోపించారు. షుగర్ ఫ్యాక్టరీ గురించి మోదీ మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తుందని అన్నారు. నిన్నటి వరకు బీఆర్ఎస్, బీజేపీ అలయ్, బలయ్‌గా ఉండి ఇప్పుడు ఎన్నికలకు ముందు డ్రామాలు ఆడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని, జాతీయ హోదాగా గుర్తించకపోవడంతోనే అవినీతికి ఆస్కారం బీజేపీనే కల్పించిందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ న్యాయ విచారణకు కమిటీ వేసిందన్నారు. తెలంగాణ పట్ల మోదీ వివక్ష చూపడంతోనే అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న కవితను ఇంతకాలం ఎందుకు అరెస్టు చేయలేదో ప్రజలకు తెలుసునని కేవలం ఎంపీ ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే అరెస్టుకు తెరలేపారన్నారు. రాష్ట్ర ఎన్నికల ఫలితాలే దేశంలో కూడా పునరావృతం అవుతాయని బీజేపీ నిజరూపం ప్రజలు గమనిస్తునారన్నారు. ఈ సమావేశంలో పీ సీసీ సభ్యుడు మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ఉన్నారు.

జనశక్తి పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 18: జనశక్తి నక్సలైట్ల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన పాకాల సాయి అనే వ్యక్తిని సోమవారం కోనరావుపేట పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన సాయి అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత విప్లవ సంస్థ అయిన జనశక్తి అరుణోదయ సంస్థలో పనిచేస్తున్నట్లు చెప్పి అమాయక ప్రజలను బెదిరింపులకు పాల్పడుతూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో డబ్బులు వసూళ్లకు పాల్పడే వారి సమాచారం అందివ్వాలని, ఎవరైనా ఫోన్‌కాల్‌చేసి బెదిరిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

కరీంనగర్‌క్రైం, మార్చి 18: కిసాన్‌నగర్‌లోని బేతెస్తచర్చి సెక్రటరీ కవ్వంపల్లి తిమోతిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్-3 టౌన్ సిఐ తెలిపారు. మానకొండూర్ శాసన సభ్యుడు సత్యనారాయణను చర్చిలోని పిలిచి సన్మానించినందుకు ఎన్నికల కోడ్‌ఉల్లంఘన కింద మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి నివేదిక ప్రకారం కరీంనగర్-3 టౌన్‌లో తిమోతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడిపితే జైలు

కరీంనగర్ క్రైం, మార్చి 18: మద్యం సేవించి వాహనం నడిపిన వారికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ కరీంఉల్లా తెలిపారు. నగరలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 19 మందిని కరీంనగనర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా ఏడుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష, 16 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. మిగతా 12 మందికి 18,000 రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరంలో ప్రతి రోజు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లు ఉంటాయన్నారు. ఈ సంవత్సరంలో 61 మందికి మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు జైలు శిక్ష పడిందన్నారు.

22లోగా బీహెచ్ఎంసీటీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, మార్చి 18: ఎస్‌యూ పరిధిలోని బీహెచ్ఎమ్‌సీటీ(బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్ క్యాటరింగ్ టెక్నాలజీ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష రుసుం చెల్లించడానికి ఈ నెల 22వరకు గడువు ఉందని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 27వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


లక్ష్మయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మార్చి 18: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ బైక్ ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని గంగారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని మొట్లపల్లికి చెందిన దొమ్మటి లక్ష్మయ్య(64) తన కొడుకు తిరుపతితో కలిసి ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ మండలం పెరుకపల్లిలో ఆదివారం ఒక శుభకార్యానికి హాజరయ్యారు. రాత్రి మొట్లపల్లికి తిరిగి వస్తుండగా గంగారం శివారులో ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న దొమ్మటి లక్ష్మయ్య చేతి కర్రకు ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం తాకడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి తండ్రీకొడుకులు కిందపడ్డారు. తిరుపతికి స్వల్ప గాయాలు కాగా లక్ష్మయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. టాటాఏస్ వాహనదారుడు తీవ్ర గాయాలైన లక్ష్మయ్యను వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి విస్మిత తేజ్

జ్యోతినగర్, మార్చి 18: సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి విస్మిత తేజ్ సూచించారు. విస్మిత తేజ్ ఎన్టీపీసీలో సోమవారం పర్యటించారు. ఉదయం రామగుండం ఎన్టీపీసీకి చేరుకున్న విస్మితకు ఈడీ కేదార్‌రంజన్ పాండు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) కంట్రోల్ రూంను పరిశీలించారు. ప్రాజెక్టుకు చెందిన ఆపరేషన్ అధికారులతో, యువ ఎగ్జిక్యూటివ్ ట్రైనీతో సమావేశమై విద్యుత్ కేంద్రం పనితీరుపై చర్చించారు. టీఎస్‌టీపీలోని ఇతర విభాగాలను ఏరియల్ వ్యూలో అదనపు కార్యదర్శి విస్మిత పరిశీలించారు. తరువాత 2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో పర్యటించారు. ఈ సందర్భంగా బొగ్గు సరఫరా, అన్‌లోడింగ్‌కు సంబంధించి ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును అదనపు కార్యదర్శి విస్మిత తేజ్ సందర్శించారు. దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు నిర్వహణ, పనితీరుపై ఆమె సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం


టీఎస్‌టిపిపిలో పర్యటిస్తున్న అదనపు కార్యదర్శి విస్మిత తేజ్

ఎన్టీపీసీ, సింగరేణి సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బొగ్గు సరఫరా, అన్‌లోడింగ్, కోల్ స్టాక్ విషయంలో సమస్యలు రాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్, ఎన్టీపీసీ ఈడీ(ఎఫ్ఎం) ప్రదిప్తా కుమార్ మిశ్రా, రామగుండం ఈడీ కేదార్ రంజన్ పాండు పాల్గొన్నారు.

వివాహిత హత్య

● గొంతు నులుమి ఘాతుకం
● పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

మల్యాల, మార్చి18: మండలంలోని మ్యాడంపల్లి శివారులో ఓ వివాహిత తన మొదటి భర్త చేతిలో హత్యకు గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాలకు చెందిన కరుపి అంజలి(22)కి గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులు సాఫీగానే సాగిన వీరి సంసారంలో గొడవలు మొదలయ్యాయి. గొడవలు కాస్త ముదిరి ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండేళ్ల క్రితం విడిపోయారు. అనంతరం అంజలికి సిద్దిపేటకు చెందిన మరో యువకుడితో కుటుంబ సభ్యులు వివాహం జరిపించారు. ఈ క్రమంలో అంజలి ఆదివారం మొదటి భర్త నరేష్ ఇంటికి వచ్చి కలుసుకుంది. అదే రోజు ఇద్దరి మధ్య ఏం జరిగిందో ఏమో గానీ మరునాడు సోమవారం ఉదయం అంజలి మృతదేహాన్ని మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో కొందరు గుర్తించారు. నరేష్ మద్యం మత్తులో అంజలితో గొడవ పడి ఆదివారం గొంతు నులిమి హత్యకు పాల్పడినట్లు ఘటనా స్థలాన్ని బట్టి స్థానికులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమ వారం గొడవ పడ్డ ప్రదేశానికి వెళ్లిన నరేష్ మృతదేహాన్ని చూసి అనంతరం నేరుగా గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. అక్కడి పోలీసులు మల్యాల పోలీసులకు సమాచారం అందించడంతో నరేష్‌ను మల్యాల స్టేషన్‌కు తరలించారు అనంతరం మల్యాల సీఐ రవి, ఎస్సై అబ్దుల్‌రహీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


అంజలి (ఫైల్)

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

కరీంనగర్ టౌన్, మార్చి 18: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జి.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నందున అధ్యాపకులు సకాలంలో హాజరుకావాలన్నారు.

26 నుంచి బీ ఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, మార్చి18: ఎస్‌యూ పరిధిలో బీ ఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 18: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 31మంది రైతులు 382క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. గత శుక్రవారం క్వింటాల్ రూ.7800 పలికిన పత్తి ధర తాజాగా రూ.200 దిగింది.

సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు అందించాలి


సుద్దాలను సన్మానిస్తున్న భారతి సాహిత్య సమితి సభ్యులు

కోరుట్ల, మార్చి 18: మన సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు అందించాలని సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. పట్టణంలోని సినారె కళాభవనంలో భారతి సాహిత్య సమితి స్వర్ణోత్సవ ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహిత్య సమితి వ్యవస్థాపకుడు స్వర్గీయ డాక్టర్ అందే వెంకటరాజం రచించిన "నిండగిరి నరసింహ శతకం"ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశోక్‌తేజ మాట్లాడారు. కళలకు నిలయాలుగా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు నిలుస్తాయని అన్నారు. సామాజిక చైతన్యంలో సాహిత్యం పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా సాహిత్యంలో తనకు కోరుట్ల ప్రాంతం తల్లి లాంటిదని, తనకు మార్గ దర్శనం చేసిన ఈ గురువులను ఎన్నటికీ మరచిపోలేనని అన్నారు. సమితి సభ్యులు డాక్టర్ ఆశోక్ తేజ, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య సమిత సభ్యులు కంచర్ల రామాచార్య, బట్లు హరికృష్ణ, అందే రాజేంద్ర ప్రసాద్, రాజోజు భూమేశ్వర్, బ్రహ్మణగారి శంకర్ శర్మ, అందే శివప్రసాద్, ఆడెపు శేఖర్, కల్కకోట చంద్రప్రకాష్, రాస భూమయ్య, తత్వాది మాదివి-రాజేంద్ర ప్రసాద్, గోనే శ్రీహరి, వనపర్తి చంద్రమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మపురి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 18: ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక నంది విగ్రహం నుంచి దేవాలయం వరకు గల ప్రధాన రహదారి వరు చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఆయన మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రంలోని దేవాలయంలో జరిగే స్వామి వారి కళ్యాణం, బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో జరిగే తెప్పో, డోలోత్సవాలు, ఉత్సవాల కోసం హాజరయ్యే భక్తుల వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. భక్తుల కోసం అందించే తాగు నీరు, గోదావరి నది వద్ద భక్తుల స్నానాలు సంబంధించిన వసతుల ఏర్పాట్లను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రంలో 13 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాకు హాజరయ్యే భక్తులు గోదావరి నది స్నానం చేసుకుని స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం చేసే వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక వసతుల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన నూతన కమిటీ సభ్యులు కూడ సమన్వయంతో పని చేసి అన్ని వేళలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు. అనంతరం నూతన ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపునూటి శ్రీకాంత్,


ఉత్సవ కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మాదాసు మల్లేష్, కొమురెల్లి పవన్‌కుమార్, నేదునూర్ శ్రీధర్‌ను ఆయన శాలువా కప్పి సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

-ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద కటుకం స్టూడియోస్ వారిచే నిర్మించబడిన ఓ అంబేద్కరుడా మీకు పోటీ ఎవ్వరూ అనే సాంగ్ పోస్టర్, సాంగ్ ప్రోమోను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ భీమనాతి శారద, లైరిక్ కటుకం నరేందర్, సింగర్లు శాంతాకుమారి, గంగాధర్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

కమనీయం.. మల్లికార్జునస్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 18: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మల్లికార్జునస్వామి కేతమ్మ, మేడాలమ్మ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తిలకించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఎంపీటీసీ గీతాంజలి, నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. సంఘం నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నాయకులు

చందుర్తి, మార్చి 18: చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని వేంకటేశ్వర స్వామికి హైదరాబాద్‌కు చెందిన కాసర్ల సురేఖ- రాజేశ్వర్ రెడ్డి దంపతులు సోమవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 23 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముందస్తుగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొదమగుళ్ల శ్రీకాంతాచార్యులు, ఆలయ చైర్మన్ గడ్డం లక్ష్మారెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి


పనుల వివరాలు తెలుసుకుంటున్న జడ్పీసీఈవో ఉమారాణి

చందుర్తి, మార్చి 18: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జడ్పీసీఈవో ఉమారాణి అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనంతోపాటు, రామారావుపల్లిలో నిర్మాణంలో ఉన్న సైడ్ డ్రైన్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి పనులను శరవేగంగా పూర్తి చేయాలని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్ కుమార్ ఉన్నారు.

మహిళల రక్షణే షీటీం లక్ష్యం

గంభీరావుపేట, మార్చి 18 : మహిళలు, యువతులు, బాలికల రక్షణే షీటీం ప్రధాన లక్ష్యమని ఏఎస్సై ప్రమీల అన్నారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు అన్యాయానికి గురైనప్పుడు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల ప్రదేశాల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, పని ప్రదేశాల వద్ద మహిళలకు వేధింపులు, బాలికలపై ఎ లైంగిక వేధింపులకు వంటివాటిపై నిర్భయంగా షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారదు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇబ్బందులు తలెత్తితే నేరుగా లేదా 100 డయల్‌కు కాల్ చేయాలన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకులు


గుంతలను పూడుస్తున్న యువకులు

వీర్నపల్లి, మార్చి 18:ఎల్లారెడ్డిపేట నుంచి వీర్నపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గమనించిన మండలంలోని కంచర్ల గ్రామ యువకులు సోమవారం శ్రమదానం చేపట్టి కంకర, మట్టితో పూడ్చివేశారు. స్థానిక యువకుడు బండి మహేందర్ మాట్లాడుతూ గుంతలు పడి ప్రజలు ఇబ్బందులు పడినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

డిగ్రీ కళాశాలలో వీడ్కోలు వేడుకలు

గంభీరావుపేట, మార్చి 18 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ జీవితంలో స్థిరపడాలంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా గమ్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, సీనియర్ అధ్యాపకులు శ్రీవల్లి, ఎన్ఎస్ఎస్ పీవో ధర్మపురి, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రం ఎదుట నిలిచిన వరద నీరు

ఎల్లారెడ్డిపేట, మార్చి 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం పదో తరగతి పరీక్షలు జరిగాయి. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అధికారులు పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం ఎదుట వరద నీరు చేరడంతో విద్యార్థులు నీటిలో నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. నీరు దాటడమే అసలు పరీక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రం పరిసరాలు, కేంద్రంలో అన్ని వసతులు కల్పించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుడి చెరువు సుందరీకరణలో ఆధ్యాత్మికత ఉట్టి పడాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, మార్చి 18: వేములవాడ గుడి చెరువు బండ్ మీద నిర్వహించే సుందరీకరణ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రాజన్న గుడి చెరువు సుందరీకరణ, ఇతర అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటరాజ విగ్రహాన్ని ఆలయ అర్చకుల సలహాలు, సూచనలు తీసుకొని, సంప్రదాయబద్ధంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. మొక్కలు ఎక్కువ సంఖ్యలో నాటాలని, పిల్లలు ఆడుకునే స్థలం, నడిచే స్థలం విషయంలో పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులను ఏప్రిల్‌లోగా పూర్తి చేయాలని టూరిజం శాఖ అధికారులను ఆదేశించారు. గుడి చెరువు ఆవరణలో కొనసాగుతున్న శివార్చన వేదిక నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ ఈఈ రాజేశ్‌కు పలు సూచనలు చేశారు. తిప్పాపూర్ బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ బండ్ పార్కును పనులను పరిశీలించారు. అనంతరం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అంతకుముందు పార్క్, ఇతర నిర్మాణాల మ్యాప్‌లను పరిశీలించారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, టూరిజం డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్ కుమార్, ఆలయ ఈఈ రాజేష్, డీటీసీపీవో అన్సారీ, ఏఈ నరసింహస్వామి ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం వేములవాడ ఏరియా ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో ఆట వస్తువులు, సౌకర్యాలను పరిశీలించారు. అక్కడి నుంచి నేరుగా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్‌కు వెళ్లి అక్కడ రిజిస్ట్రేషన్ విధానాన్ని తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే విధానాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడారు. గర్భిణులకు అందుతున్న సేవలు నెలవారి టార్గెట్‌లు, అచీవ్‌మెంట్‌లు, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, ప్రసవాల సంఖ్య, హాజరు, సెలవు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఒక గర్భిణీతో మాట్లాడి ఆమె మెడికల్ రిపోర్ట్స్ పరిశీలించారు. సేవలు ఎలా అందుతున్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు వ్యాయామం, ఆరోగ్య అవగాహన కల్పించే గదిని పరిశీలించారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

వేములవాడ పట్టణంలోని ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్ట్రాంగ్ రూములను కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్ రావు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేష్ రావు తదితరులు ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 18: ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని దేవుళ్లకు మొక్కులు చెల్లించుకున్నాని, పండుగలు సంస్కృతీసంప్రదాయాలకు చిహ్నాలు అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు సోమవారం హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బొప్పాపూర్‌లోని మల్లికార్జునస్వామి కల్యాణ వేడుకల్లో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నానన్నారు. అన్నదాతలు నష్టపోకుండా ఉండాలన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. యాదవ సంఘం సభ్యులు విన్నవించిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆది శ్రీనివాస్‌ను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాజేశం, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దేవయ్య ఎల్లయ్య, బాలయ్య పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

యజమానులు డబ్బులు చెల్లించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 18 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలు బంద్ అవడడంతో ఆసాములు, కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, యజమానులు స్పందించి డబ్బులను చెల్లించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ కోరారు. సిరిసిల్లలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలంటూ ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు సోమవారానికి 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ మూడు నెలల నుంచి పరిశ్రమలు బంద్ ఉండడంతో ఆర్థికంగా ఆసాములు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ డబ్బులను యజమానులు చెల్లించాలంటూ పాలిస్టర్ అసోషియేషన్‌లో చర్చలు చేపట్టినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ రావడంతో రిలే నిరాహార దీక్షలను విరమించి పాలిస్టర్ అసోషియేషన్ ఎదుట దీక్షలకు మంగళవారం నుంచి కూర్చోనున్నట్లు ప్రకటించారు. ఆదివారం చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసినట్లు, త్వరలోనే ప్రభుత్వ ఆర్డర్‌లను ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. అంతవరకు తమ కుటుంబాల పోషణకు యజమానులు డబ్బులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసాములు చీరాల అశోక్, మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం కోసం స్థలం పరిశీలన

రుద్రంగి, మార్చి 18: రుద్రంగి మండల కేంద్రంలో రామాలయం నిర్మాణం కోసం స్థలాన్ని హనుమాన్ స్వాములు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయం పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమిరె శంకర్, పల్లి గంగాధర్, ఆకుల గంగాధర్, కూర్మచలం సత్యనారాయణ, స్వర్గం పరంధాములు, కందుకాల నారాయణ, ఆకుల పెద్దన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

వేములవాడ టౌన్, మార్చి 18 : రాష్ట్ర స్థాయి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్ట్ పోటీలకు వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాల నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. గత నెలలో కళాశాలలో నిర్వహించిన 12 ప్రాజెక్టులకు నాలుగ ఎంపికవడంపై హ ర్షం వ్యక్తం చేశారు. కళాశాల జిజ్ఞాస సమన్వయకర్త డాక్టర్ అఫ్సారి ఉస్మానిని అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ మధురాజేశ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైస్ ఎంపీపీ పీఠం కాంగ్రెస్ కైవసం

- వనపర్తి దేవరాజు ఏకగ్రీవ ఎన్నిక


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన దేవరాజు

వేములవాడ టౌన్, మార్చి 18 : వేములవాడ అర్బన్ మండలం వైస్ ఎంపీపీ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. వేములవాడ వైస్ ఎంపీపీ పదవిపై నలుగురు ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టారు. దీంతో ఎన్నికల అధికారి వైస్ ఎంపీపీ పదవికి షెడ్యూల్ నిర్వహించారు. ఇంతలో వైస్ ఎంపీపీ ఆర్సీరావు తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ ఎన్నిక ఆర్డీవో రాజేశ్వర్ నిర్వహించారు. మొత్తం ఆరుగురు ఎంపీటీసీ సభ్యులకు బుర్ర లహరిక, గాలిపెల్లి సువర్ణ, బాస రాజశేఖర్, వనపర్తి దేవరాజు హాజరయ్యారు. వైస్ ఎంపీపీ స్థానానికి వనపర్తి దేవరాజు ఒక్కరే నామినేషన్ వేయడంతో వనపర్తి దేవరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కాగా బీఆర్ఎస్ ఎంపీటీసీలు బూర వజ్రవ్వ, ఆర్సీరావు ఎన్నికకు హాజరుకాలేదు.

అభినందించిన ప్రభుత్వ విప్..

వేములవాడ అర్బన్ మండల వైస్ ఎంపీపీగా ఎన్నికైన వనపర్తి దేవరాజును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు. దేవరాజు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ అభినందించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు

ఎల్లారెడ్డిపేట, మార్చి 18: తండ్రి మరణించినా తప్పనిసరి పరిస్థితుల్లో కుమారుడు పరీక్షకు హాజరయ్యాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో చోటు చేసుకున్న సంఘటన స్థానికులను కలిచివేసింది. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పుట్టి రవి (45) కూలీ పనులు చేస్తూ భార్య, కొడుకులను పోషించుకుంటున్నాడు. అతడి పెద్దకుమారుడు శ్రావణ్ అక్కపల్లిలోని తన చిన్నమ్మ భూదవ్వ వద్ద ఉంటూ దుమాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలు సిద్ధమయ్యాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రవి ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు శ్రావణ్‌కు ధైర్యం చెప్పి పరీక్ష రాయాలని సూచించారు. దీంతో తండ్రి చనిపోయిన బాధను దిగమింగుకొని శ్రావణ్ పుట్టెడు దుఃఖంలోనూ పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల పరీక్ష కేంద్రంలో పరీక్ష రాశాడు. పరీక్ష పూర్తయిన తర్వాత సాయంత్రం తండ్రి అంత్యక్రియలను నిర్వహించారు.


పరీక్ష అనంతరం తండ్రి చితికి నిప్పుపెడుతున్న శ్రావణ్

టీజీసీజీటీఏ డైరీ ఆవిష్కరణ

వేములవాడ టౌన్, మార్చి 18 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం-2024(టీజీసీజీటీఏ) డైరీ, క్యాలెండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మధురాజేశ్, తిరుకోవెల శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నీలం శ్రీనివాస్, ప్రభాకర్, అఫ్సారీ ఉస్మాని, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, మార్చి 18: జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా చైర్మన్‌గా చొప్పరది రామచంద్రం, వైస్ చైర్మన్‌గా అంబటి శేఖర్, డైరెక్టర్లుగా గాడిచెర్ల శ్రీనివాస్, పని శివరామకృష్ణ, కూనవేని పర్శరాం, జెట్టి దేవయ్య, గాడిచర్ల దేవయ్య పిట్ల బాబు, యామ తిరుపతి, నల్ల మోహన్, నిమ్మల బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను సన్మానించారు. అనంతరం సంఘం జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు, నాయకులు కలెక్టర్‌లో అధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రానబోయిన లక్ష్మణ్, బొజ్జ కనకయ్య, కీసర నాగరాజు, చొక్కాల రాము, గజ్జల రాజు, నాగరాజు, శేఖర్, మునిగెల రాజు, వివిధ మండలాల ముదిరాజ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై డీపీవోకు ఫిర్యాదు

ముస్తాబాద్, మార్చి 18 ముస్తాబాద్ మండల కేంద్రంలోని దుబ్బాక రహదారిలో గ్రామ పంచాయతీ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన చేపట్టిన అక్రమ నిర్మాణంపై కాంగ్రెస్ జిల్లా నాయకుడు వేముల సత్యానారాయణ జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాల ఆరోపణల నేపథ్యంలో మూడేళ్లుగా నిలిచిపోయిన భవన నిర్మాణం పాలక వర్గం పదవి దిగగానే మండల కేంద్రానికి చెందిన ప్రత్యేకాధికారి, ఇన్‌చార్జి ఈవో అండదండలతో నిర్మాణ పనులను ముమ్మరం చేశారని సత్యనారాయణ ఆరోపించారు. సదరు గృహ నిర్మాణదారులతోపాటు, కాంట్రాక్టర్ నర్సింలుపై ఇన్‌చార్జి ఈవో శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇళ్ల డబ్బులు ఇప్పించాలి

ఇల్లంతకుంట, మార్చి 18: మండలంలోని అనంతారంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన 20 మందికి డబుల్ బెడ్‌రూంలు మంజూరయ్యాయని, కొంత సొంత డబ్బుతో నిర్మించుకుంటే మిగతా డబ్బులు చెల్లిస్తామని అధికారులు పేర్కొన్నారు. దీనితో కొందరు లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారు. పనులు సగం పూర్తయిన తర్వాత అధికారులను డబ్బులు ఇవ్వాలని కోరితే ప్రభుత్వం మారిందని, తమ పరిధిలో లేదని సమాధానం చెబుతున్నారని, న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన దేవవ్వ, సరస్వతి, మహేష్, రజియ, అనిత, పుష్పలత, జ్యోతి, అంజలి, పద్మ తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణదారులు సమయపాలన పాటించాలి

చందుర్తి, మార్చి 18 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యం దుకాణదారులు సమయపాలన పాటించాలని ఎక్సైజ్ ఎస్సై రవి అన్నారు. చందుర్తి మండల కేంద్రంతోపాటు మర్రిగడ్డలోని మద్యం దుకాణంలోని రికార్డులను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రోజువారి స్టాక్ వివరాలపై తమకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. మద్యం దుకాణదారులు ప్రతీ రోజు సమయపాలన పాటించని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు

నేటి నుంచి తక్కళ్లపల్లి వేంకటేశ్వరస్వామి జాతర

కథలాపూర్, మార్చి 18 : ఈ నెల 19 నుంచి 26 దాకా జరిగే శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారం భం కానున్నాయి. 19న పుణ్యాహవచనం, అంకురారోపణ, గరుడ కళ్యాణం, ధ్వజారోహణం, 20న సుప్రభాత సేవ, చంద్రప్రభ వాహన సేవ, 21న బలి ప్రదానం, సత్య నారాయణ వ్రతం, 22న కుంకుమ పూజ, హంసవాహన సేవ, 23న కామదహనం, వాహన సేవలో స్వామివారి గ్రామ పర్యటన, 24న మహాప్రసాదం, అన్నదానం, డోలో త్సవం, బంతులాట, రథహోమం, 25న ఉదయాత్పూర్వం రథోత్సవం, స్వామివారి ఆలయ ప్రవేశం, తిరుమంజనం, 26న నాగవెళ్ళి, బలి ప్రదానం, రుత్విక్ సన్మానం, ఏకాంత సేవ ఉత్సవ పరిసమాప్తి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ జిల్లా సత్యనారాయణ తెలిపారు. భక్తులు జాతరకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పంటలకు నీటి విడుదల

భీమారం, మార్చి 18: మండలంలోని వరద కాలువకు నీటిని విడుదల చేయడంతో రైతులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వరద కాలువలో నీళ్ల అడుగంటి రైతుల పంట పొలాలు ఎండిపోవడంతో మన్నెగూడెం గ్రామానికి చెందిన గంట శంకర్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి డీఈతో మాట్లాడి వరద కాలువకు నీటి విడుదల చేయించారు. దీంతో ఆది శ్రీనివాస్‌కు మండల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


వీర్నపల్లిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో మొత్తం 470 మంది విద్యార్థులకు 470 మంది పరీక్షలు రాసినట్లు సీఎస్‌లు మనోహరచారి, రమేశ్ పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్ వద్ద విద్యార్థులను తనిఖీలు చేసి ఉదయం 9 గంటలకే లోనికి అనుమతించారు. హాల్ టికెట్ నంబర్లను చూసుకునేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మైనార్టీ రెసిడెన్షియల్, జిల్లెల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాల్లో 600 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో రఘుపతి తెలిపారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గాలిపెల్లి ప్రభుత్వఉన్నత పాఠశాలలో 394మంది విద్యార్థులకు మొత్తం మంది హాజరైనట్లు ఎంఈవో బన్నాజీ తెలిపారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలి రోజు తెలుగు పేపర్‌కు 229 మందికి 228 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మురళీధర్ తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి పర్యవేక్షించారు. స్థానిక ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాటు లింగన్నపేటతో కలిపి మొత్తం 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 521 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, హంసిని, కిడ్స్ కాన్వెంట్, గౌతమ్ మోడల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో మొత్తం 1163 మంది విద్యార్థులకు 1162 మంది హాజరయ్యారని మండల విద్యాధికారి బన్నాజీ తెలిపారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో సోమవారం 249 మంది విద్యార్థులకు మొత్తం మంది హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాస దీక్షితులు తెలిపారు.

కోనరావుపేట: కోనరావుపేట జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు 140 మందికి 139 మంది విద్యార్థులు హాజరయ్యారు. మోడల్ స్కూల్‌లో 133 మంది విద్యార్థులకు 133 మంది హాజర య్యారు. ధర్మారం జడ్పీహెచ్ఎస్‌లో 13 మందికి 13 పరీక్ష రాశారు.


ఎల్లారెడ్డిపేటలో తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు




గంభీరావుపేట, వేములవాడలో సెంటర్‌లోకి వెళ్తున్న విద్యార్థులు